# విద్యతోనే ఉన్నత శిఖరాలు

## నగర డీఎస్పీ రాధిక ● స్పందన ఫౌండేషన్ ప్రతిభ పురస్కారాల ప్రదానం

**నెల్లూరు(బాలాజీనగర్), న్యూస్‌టుడే** : ఎదుటి వారికి సాయం చేయడంలో ఉన్న ఆనందం మరెందులోనూ ఉండదని నెల్లూరు నగర డి.ఎస్.పి. రాధిక పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నెల్లూరు పురమందిరంలో జరిగిన స్పందన ఫౌండేషన్ ప్రత్యేక పురస్కారాల ప్రదానోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య మనిషి ఉన్నతికి దోహదపడుతుందన్నారు. ఇందుకు స్పందన ఫౌండేషన్ అధినేత ఎన్.నాగేశ్వరరావు గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడినా ఆయన చదువుకున్న ప్రాంతాన్ని మరచిపోకపోవడం గొప్ప విషయమన్నారు. విద్య నేర్చుకోవాలనుకునే పేద విద్యార్థులకు నాగేశ్వరరావు సహాయం అందించడం ఇతరులకు ఆదర్శమని అభినందించారు. స్పందన ఫౌండేషన్ అనే దానికన్న ప్రేరణ ఫౌండేషన్ అంటే ఎంతో బాగుంటుందని ఆమె సూచించారు. స్పందన ఫౌండేషన్ బాల కార్మికుల కోసం మొబైల్ విద్య వాహనాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.




జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ రాధిక

### పేద విద్యార్థులకు చేయూత

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నాగేశ్వరరావు తండ్రి కృష్ణయ్య మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు సేవా చేయాలన్న సదుద్దేశం ఏర్పడిందని తెలిపారు. 2009లో ప్రారంభించిన ఫౌండేషన్ మొదటి సంవత్సరం 30 పాఠశాలల్లో 900 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేసిందని చెప్పారు. 2008-09 లో 170 పాఠశాల్లో మూడు వేల మందికి సేవ చేయాలని సంకల్పించినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు 17 మందిని ఫౌండేషన్ ఛైర్మన్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే సివిల్స్‌కు జిల్లా నుంచి ఎంపికైన బూడుగు శ్రీనివాసులురెడ్డి, ఖాన్ ఇంతియాజ్‌లతో పాటు 600 మంది పేద విద్యార్థులకు రెండు జతల యూనిఫాం, పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. పదోతరగతిలో 500 మార్కులు సాధించిన వారికి ప్రతిభ పురస్కారాలు, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల కరస్పాండెంట్ ఆచార్య ఆదిత్య, రాష్ట్ర హోటళ్ల సంఘం ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, రిటైర్డు ఆర్.వి.ఎం. ఉద్యోగి మనోహర్‌రెడ్డి, పాటూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాంజలి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ అలరించింది.




ఉపాధ్యాయుడు శ్రీనివాసులును సన్మానిస్తున్న నాగేశ్వరరావు